

# నిజం

## మల్లిక్

కామేశ్వరరావు చెప్పిన విషయం విని నేను చాల ఆశ్చర్యపోయాను. నేను ఊహించినదానికి పూర్తి విరుద్ధంగా ఉంది అతను చెప్పిన విషయం.

"నిజమేనోయ్...విమలమీద నాకు అటువంటి అభిప్రాయం అసలెప్పుడూ లేదు..." అంటూ చెప్పడం ముగించాడు.

విమలా కామేశ్వరరావులు మంచి స్నేహితుల క్రిందే చెప్పుకోవచ్చు. వాళ్ళ పరిచయం ఎప్పుడు ఎక్కడ జరిగిందో తెలియదుగానీ వాళ్ళలో ఒకళ్ళంటే మరొకరికి అభిమానం ఉందని మాత్రం తెలుసు. బహుశా ఆఫీసులో పనిచేస్తూ చేస్తూనే పరిచయం ఏర్పడి, తరువాత స్నేహంగా మారి ఉంటుందని నా ఊహ ; కామేశ్వరరావు నేనుండే సెక్షనులోనే పనిచేస్తున్నాడు.

విమల వేరే సెక్షనులో పనిచేస్తుందిగానీ మధ్యాహ్నం లంచ్ సమయానికి మా దగ్గరికి వస్తుంది. విమల నాతోకూడా మాట్లాడుతుంది గానీ కామేశ్వరరావుతో ఉన్నంత చనువుగామాత్రం ఉండదు అసలు నాతోనైనా నేను కామేశ్వరరావుకు స్నేహితుడిని గాబట్టి మాట్లాడుతుందేమో !!...

ఇన్నాళ్ళూ కామేశ్వరరావూ విమలలు ఒకళ్ళ ఇళ్ళకు మరొకళ్ల వెళ్ళడం, సినిమాలకూ, షికార్లకూ వెళ్ళడం జరుగుతూ ఉంది. కానీ ఈ మధ్య వారికి అభిప్రాయభేదాలు వచ్చినట్లు నాకు అనుమానం పుట్టింది నా అనుమానానికి సరియైన కారణం లేకపోలేదు. విమలా కామేశ్వరరావులు ఇదివరకట్లా కలుసుకోవడంలేదు. విమల కూడా లంచ్ సమయంలో మా సెక్షనుకు రావడంలేదు. ఒకవేళ ఎప్పుడైనా వచ్చినా ఆమె నాతోనే కాస్త మాట్లాడుతుంది. కామేశ్వరరావుతో ఏదో పొడి పొడిగా మాట్లాడుతుంది. వారిద్దరి మధ్యా రాను రాను మాటలు కూడా కరువైపోతుంటే నా అనుమానం దృఢమైంది. వారిద్దరి స్నేహం ఇలా దెబ్బ తినడానికి అసలైన కారణం ఏమయి ఉంటుందో నా ఊహకు చిక్కడం లేదు. కొన్నాళ్ళు ఓపికపట్టానుగానీ ఇక కుతూహలం అణుచుకోలేక వాడినే అడిగేశాను అసలు విషయం ఏమిటని. అప్పుడు జరిగిన సంగతి ఇదన్ని అంతా చెప్పుకొచ్చాడు. అతను చెప్పిన విషయం నిజంగా నాకు చాల ఆశ్చర్యం కలిగించింది.

విమల తమ స్నేహాన్ని మరో విధంగా అర్థంచేసుకుని అపార్థంచేసుకుందనీ ... కొన్నిరోజులక్రితం తన దగ్గరికివచ్చి తనను ప్రేమిస్తున్నట్టూ... పెళ్ళిచేసుకోమని అడిగినట్లూ ... తను అందుకు నిరాకరించినట్టూ చెప్పాడు కామేశ్వరరావు.

విమలను వివాహం చేసుకోవడానికి కామేశ్వరరావు ఎందుకు నిరాకరించాడో నాకు అర్థంకాలేదు. విమలకంటే అందమైన, యోగ్యురాలైన అమ్మాయి అతనికి భార్యగా లభిస్తుందన్న నమ్మకం కూడా నాకు లేదు. అదే విషయం వాడితో అన్నాను.

'లేదోయ్ ... నువ్వు చాల పొరబాటు పడుతున్నావ్ !... నా మనస్తత్వానికీ ఆమె మనస్తత్వానికీ చాల తేడా ఉంది. మా ఇద్దరి అభిప్రాయాలు ఏవీ కలవవు, మేమిద్దరం పెళ్ళిచేసుకుంటే అంతగా సుఖపడమని అనుకుంటాను. అందుచేతనే స్నేహాన్ని పెళ్ళితో ముడిపెట్టకని విమలతో చెప్పాను. కానీ ఆమెకు కోపంవచ్చి నా స్నేహాన్ని కూడా వదులుకుంది...పూర్ గర్ల్..." అన్నాడు కామేశ్వరరావు నిట్టూరుస్తూ.

విమలతో వివాహం యిష్టపడక పోవడానికి కామేశ్వరరావు చెప్పిన కారణం నాకు అంత సమర్థనీయంగా

కనిపించలేదు. అంతేకాకుండా వాడు నా దగ్గర ఏదో దాస్తున్నాడన్న అను మానం కూడా వచ్చింది వాడు విమల గురించి మాట్లాడుతున్నప్పుడు వాడి ముఖం వివర్ణంకావడం, మాటలు తడ బడడమే నేను వాడిని అనుమానించ డానికి కారణమైనాయి

కొన్నాళ్లపాటు కామేశ్వరరావు విమలల గురించి నాలో అంతులేని ఆలో చనలు సాగాయి కానీ కాలక్రమాన కొన్నినెలల అనంతరం వాళ్ళవిషయం నా మనసులో మరుగున పడిపోయింది

ఒకరోజు మా సెక్షనుకు శుభలేఖల కట్టపట్టుకుని వచ్చింది విమల ఆమె వివాహం నిశ్చయం అయింది కామేశ్వర రావుకూ నాకూ శుభలేఖలు ఇచ్చింది

కామేశ్వరరావుకు శుభలేఖ ఇస్తు న్నప్పుడు "నన్ను క్షమించు కామేశం" అని విమల నెమ్మదిగా అన్నది ఆమె మాటలు నా చెవిని పడకనే పడ్డాయి కామేశ్వరరావు స్నేహభావాన్ని అపార్థం చేసుకున్నందుకు విమల ఇప్పుడు పశ్చాత్తాపపడుతుందని అనుకున్నాను

కామేశ్వరరావు ఒకసారి నా వైపు చూసి మళ్ళీ విమలవైపు తిరిగి "ఛ ... ఛ ... ఇందులో నీ తప్పేం ఉంది ... నువ్వే నన్ను క్షమించు'' అన్నాడు తగ్గు స్థాయిలో

విమల పెళ్ళికి కామేశ్వరరావు రాలేదు నేను విమల పెళ్ళికి వెళ్ళ బోతుంటే నా దగ్గరికి పరుగెత్తుకవచ్చి దంతంతో చేసిన ఒక తాజ్‌మహల్ బొమ్మను నా ఒళ్ళో పెట్టి "ఇది విమలకు నా తరపున ప్రెజెంటేషన్‌గా అందజెయ్యి ... నాకు చాల ముఖ్యమైన పనొకటి తగిలింది ... నేను పెళ్ళికి ఎటెండ్ అవడానికి కుదరదు పెళ్లికి రాలేకపోయినందుకు నన్ను క్షమించ మని విమలతో చెప్పు" అని చెప్పి ఎలా వచ్చాడో అట్లానే పరుగులాంటి నడకతో వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళి పోయాడు

విమల పెళ్ళి అయిపోయింది!

పెళ్ళయిన తరువాత విమల ఉద్యో గానికి రాజీనామా చేసింది రోజులు అలా గడిచిపోతున్నాయి

ఆ ఆదివారం నేనూ, కామేశ్వరరావూ సినిమా ప్రోగ్రాం వేసుకున్నాం నేను వాళ్ళింటికి వెళ్ళాను "ఇప్పుడే బట్టలు మార్చుకుని వస్తానుండు" అంటూ నన్ను డ్రాయింగ్ రూమ్‌లో కూర్చోబెట్టి లోపలికి వెళ్ళాడు కామేశ్వరరావు

ఏమీ తోచక బల్లమీద ఉన్న నవల తీసి పేజీలు తిరగవెయ్యడం మొదలు బెట్టాను. నవల మధ్యనుండి ఒక శుభ లేఖ క్రిందపడింది వంగి దానిని తీసి మడత విప్పిచూశాను

అది విమల పెళ్ళి శుభలేఖ!!

మళ్ళీ దానిని మడిచి నవల మధ్య పెట్టబోతూ ఏదో అనుమానం వచ్చి శుభలేఖ విప్పిచూసి ఉలిక్కిపడ్డాను.

ఆ శుభలేఖలో వరుడి పేరుని కొట్టి వేసి అక్కడ తన పేరు వ్రాసుకున్నాడు కామేశ్వరరావు !!!